ప్రేమించిన అమ్మాయికి
ఓ భర్తని
బహుమతిగా ఇచ్చిన
అతని ప్రేమకి అర్థం?

# ప్రణవనాదం

ఎస్. కవిత
కథ

ఒక్కోసారి ఊహ వాస్తవంలోకి వస్తే నిజంగా ఎంత అద్భుతంగా వుంటుంది? అద్భుతం అంటే ఇలా వుంటుందా? అనిపిస్తుంది.

అసలు దాన్ని మనసులో ఎలా నిక్షిప్తం చేసుకోవాలోకూడా అర్థంకాని.. ఆనందంతో కూడిన అయోమయ పరిస్థితి అంటే ఇదేనేమో!'' తన్మయంగా అంది కావ్య.

''వామ్మో టెన్షన్ భరించడం నావల్లకాదు. కాస్త ఆ కవిత్వాన్ని కట్టిపెట్టి పాయింట్‌కి రావే!'' వినలేనట్టుగా చేతులు జోడిస్తూ అంది రూప.

''చెబుతానే... మీతోకాక నా ఆనందాన్ని ఇంకెవరితో పంచుకుంటాను?

అసలు నెలరోజులు హాలిడేస్ ఇచ్చి మన ప్రాణాలు తిన్నారు ఈ మేనేజ్‌మెంట్‌వారు'' చిరాగ్గా అంది కావ్య.

''చూడు బేబీ! అనవసరంగా కాలేజీని ఏమనకు. ఈ హాలిడేసే ఇవ్వకపోతే ఇన్ని సినిమాలు, షికార్లు, ఊర్లు... ఇంకా...'' ఆపుతావా నీ నస... శుభమా అని అదేదో చెబుతుంటే ఊర్లు, కార్లు అంటూ నీ పోరేంటే!'' శిల్పని వారించింది రూప.

''ఒకరోజు నాకు యాక్సిడెంట్ జరిగింది. ఆ కారులో వ్యక్తి నన్ను హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు.

తిరిగి నాకు స్పృహ వచ్చాక నర్స్ నాకొక విజిటింగ్ కార్డ్ ఇచ్చింది. ఆ వ్యక్తి నాకిమ్మని చెప్పి, వీలుంటే ఒకసారి ఫోన్ చేయమని చెప్పారుట.

ఆ వ్యక్తి ఎవరో తెలుసా! ది గ్రేట్ తేజస్వినీ



అడ్వర్టయిజింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రామ్‌ప్రకాష్‌గారు.

వెంటనే ఫోన్ చేశాను. నా ఆరోగ్యం కుదుటపడ్డాక రమ్మన్నారు'' పరవశంగా అంది కావ్య.

''ఏమిటి! రామ్‌ప్రకాశ్... గాడ్! మరి వెళ్లావా? లేక బోడి నీ ఆత్మాభిమానమడ్డొచ్చి ఊరుకున్నావా?'' ఉద్వేగంగా అంది రూప.

''ఒక్కసారేంటే... నాలుగు సార్లెళ్లాను. బైదిబై మేమిద్దరం మంచి ఫ్రెండ్సయ్యాము తెలుసా?'' కాసింత గర్వంగా అంది కావ్య.

''నాలుగుసార్లే... ఛీ! నాకు చెబితే నీ వెంట నేనూ వచ్చి ఆఫీస్‌ని చూసేదాన్ని తేజస్వినీ అడ్వర్టయిజింగ్ కంపెనీ చాలా పేరుగాంచినదని విన్నాను. చదివాను. కానీ చూళ్లేదు. నిజంగా యూ ఆర్ వెరీ లక్కీ కావ్యా!'' నమ్మలేనట్టుగా అంది శిల్ప.

''హాలిడేస్ అవ్వడంవల్ల ' మీతో చెప్పలేకపోయానుగానీ... ఈ ఆనందాన్ని భరించడం ఎంత కష్టమైందో...'' స్నేహపూర్వకంగా అంది కావ్య.

''ఐతే నీకు రామ్‌ప్రకాష్‌గారు ఫ్రెండయ్యారన్నావ్.. కొంపదీసి లైనెయ్యడంలేదుకదా!'' కన్నుగీటుతూ చిలిపిగా అడిగింది రూప.

''ఛీ నోర్ముయ్! నీకెప్పుడూ పాడు ఆలోచన్లే... ఐనా ఆయన వయసెంతో తెలుసా! దాదాపు యాభై ఏళ్లుంటాయి. నా వయసుకి మూడింతలు'' ఉక్రోషంగా అంది కావ్య.

''కూల్‌డౌన్ బేబీ! ప్రేమకి వయసుతో పనేంటి?'' రెచ్చగొడుతూ అంది రూప.

''అవునవును. శరీరాలతోనేగా వుండే పనంతా... ఛీఛీ... ప్రేమంట ప్రేమ...

ఆడదాన్ని మోసం చేయడానికి మగాడు వేసుకున్న అందమైన ముసుగు ఈ ప్రేమ'' కోపంగా అంది కావ్య.

''... ... ...''

నవ్వుతూ మళ్లీ కావ్యే అంది.

''అయినా అలాంటి అభిప్రాయం నాకు లేదులే''

''నీకు లేకపోతే నీపై ఆయనకుండొచ్చుగా'' దీర్ఘంగా అంది మళ్లీ రూప.

ఆ టాపిక్‌ని ఇంకా పొడిగించలేక మనకిప్పుడు లంచ్ అవర్‌కదా! క్యాంటీన్‌కెళ్దాం పదండి'' అంటూ క్యాంటీన్‌వైపు దారితీసింది కావ్య.

● ● ●

'నిరీక్షణ'

మదిలో మెదిలే ఒక తీయని బాధే నిరీక్షణ కాబోలు! ఎన్నడూ తనకిలాంటి విపరీత పరిస్థితి ఎదురవ్వలేదు.

అసలెందుకిలా... తన మనసు ఎక్కడో... జారిపోయిన ఫీలింగ్.

ఆమెని తలచుకోగానే ఏదో సుతిమెత్తని మధుర భావన మనసుపొరల్లో వికసిస్తుంది.

ఆమెకన్నా అందమైనవారిని చాలా చూశాడు. కానీ... కానీ ఆమెలో ఏదో ప్రత్యేకత. తననాకర్షిస్తుంది. కానీ... ఇది ఎంతవరకు సమంజసం!

ఇంతలో తన ఆలోచనలకి తెర వేస్తున్నట్టుగా 'ఫోన్' మోగింది. ఆలోచనా గాధంలోనుండి తేరుకుని రిసీవర్ చేతిలోకి తీసుకుని -

''హలో'' అన్నాడు రామ్‌ప్రకాష్ గంభీరంగా.

''నమస్కారం సార్! బాగున్నారా?'' వినయంతో వినిపించింది కావ్య స్వరం.

అంతే -

ఏదో తెలియని ఉత్సాహం పుంజుకుంది

రామ్‌ప్రకాష్ వదనంలో.

''ఆ... నీ ఆరోగ్యం ఎలా వుంది?'' ఆత్మీయంగా అడిగాడు ప్రకాష్.

''బాగానే వున్నాను సార్! ఐనా ఈ జనారణ్యంలో ఏ రోడ్డుపైనో... ఏ బస్సో, కారో నన్ను ముద్దుపెట్టుకోవాలని చూస్తే మళ్లీ నా పని కాస్తా ఢమాల్'' నవ్వుతూ అంది.

''ఛ... ఛ... అదేంమాట! ఎప్పుడూ అలా మాట్లాడకు'' నొచ్చుకుంటున్నట్లు అన్నాడు.

''మా కాలేజీ ఈ రోజే రీఓపెన్ అయింది. అంతా హడావుడిగా వుంది వాతావరణం''

''నీకు వీలుంటే ఓసారి రాగలవా కావ్యా!'' మళ్లీ చూడాలనిపించి అన్నాడు ప్రకాష్.

''ఇప్పుడా...'' ఆలోచించి మళ్లీ అంది. ''చూస్తాను సార్... వీలుంటే వస్తాను'' చెప్పి ఫోన్ పెట్టేసింది.

మళ్లీ ఏదో మధురానుభూతి దూరమైపోయినట్టుగా అనిపించింది రామ్‌ప్రకాష్‌కి. గడియారంవంక చూశాడు. ఒకటి, రెండు... రెండున్నర కావస్తోంది.

వస్తుందా రాదా అని ఉద్విగ్నంగా ఎదురుచూస్తున్న రామ్‌ప్రకాష్‌కి తన చాంబర్‌కి అవతలనుండి అలికిడి వినిపించగానే అటువైపు చూశాడు. ఒక్కసారిగా ఆనందంతో ప్రకాష్ కళ్లు మెరిశాయి.

''గుడ్ ఆఫ్టర్‌నూన్ సర్!'' చిరునవ్వుతో వినయంగా అంది కావ్య.

''నీగురించే చూస్తున్నాను. కూర్చో'' అన్నాడు సంతోషంగా.

''నాగురించా?'' అర్థంకాని ఆశ్చర్యంతో అడిగింది కావ్య.

''యస్.. ఏం? నీ గురించే ప్రత్యేకంగా నిరీక్షిస్తున్నాను'' అన్నాడు ప్రకాష్ కావ్యని

## రైలు

''హమ్మయ్య రైలు కనిపెట్టడం మంచిది అయ్యింది''

''ఏం''

''లేకపోతే పట్టాలన్నీ వేస్టయిపోయేవిగా''

-సిహెచ్.వి.వి.ఎస్.మూర్తి (కొమరగిరిపట్నం)



సూటిగా చూస్తూ.

''మీరేం అంటున్నారో నాకర్థంకావడంలేదు సర్!'' అయోమయంగా చూస్తూ అంది కావ్య.

''జీవితంలో ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో ఊహించడం చాలా కష్టం. ఆ ఊహించని మలుపుని మనసులో నిక్షిప్తం చేసుకోవడం కూడా కష్టసాధ్యమే కదూ!'' నెమ్మదిగా అన్నాడు రామ్‌ప్రకాష్.

అతనేం చెప్పబోతున్నాడోనని... చాలా ఉత్సుకతతో వినసాగింది కావ్య.

కావ్య ముఖంలో ఫీలింగ్స్‌ని గమనిస్తూ... మళ్లీ కొనసాగించాడు రామ్‌ప్రకాష్.

''కావ్యా! నువ్వు నాకు పరిచయమైంది మొదలు నా మదిలో ఏవో అంతర్గత భావాలు చెలరేగాయి.

నీ వయసుకీ, నా వయసుకీ మధ్య ఇంత తేడా వున్నప్పటికీ నా యెద లోతుల్లో సరికొత్త వసంతాలు చిగురిస్తున్నాయి.

బహుశా దీన్నే ప్రేమ అంటారేమో! ఎందుకు ఎలా ఈ భావన నీపై ఏర్పడిందో తెలియదుగానీ నా మనసు నీ ఆత్మీయతని కోరుకుంటోంది.

నీలో ఏదో ప్రత్యేకత నన్ను ఆకర్షితుడిగా చేసింది'' ఆరాధన నిండిన స్వరంతో పరవశంగా తన మనసులో రగిలే ప్రేమాగ్నిని చెప్పాడు రామ్‌ప్రకాష్.

చెప్పిందంతా విని తనని తప్పకుండా నానా మాటలని వెళ్లిపోతుందేమోనని అనుకున్నాడు ప్రకాష్. ఆశ్చర్యం! కానీ ఆమె అలా అనలేదు సరికదా తనను చూసి ఒక్క నవ్వు నవ్వింది.

అంటే తన అభిప్రాయంతో ఏకీభవిస్తుందా? లేక ఈ పెద్ద మనిషికి టీనేజ్ అమ్మాయితో లవ్వేంటి? అని హేళనగా నవ్వుతోందా?

అసలు ఆమె నవ్వులో ఆంతర్యమేమిటో ఆవిడకి బోధపడలేదు. కానీ ఆమె ఏం చెప్పనుందోనని ఆత్రంగా ఎదురుచూడసాగాడు.

అదే చెదరని చిరునవ్వుతో ''ప్రేమంటే ఏమిటిసార్!'' అంది కావ్య.

''అది నువ్వే చెప్పాలా'' తిరిగి ప్రశ్నించాడు ప్రకాష్.

''రెండు కళ్ల కలయిక, ఆ తర్వాత మనసుల కలయిక... ఆపైన ఆ రెంటితో సంబంధం లేకుండా రెండు శరీరాల కలయిక...

ఆ తర్వాతేముంది? ఆడదాన్ని తేలికగా మోసం చేసి తన చేతులు దులుపుకుంటాడు మగాడు'' కర్కశంగా అంది కావ్య.

అలా అంటున్నప్పుడు అంతకుముందున్న చిర్నవ్వు మచ్చుకైనా కనిపించలేదు కావ్య వదనంలో.

''తప్పు కావ్యా! ప్రేమను అంత తక్కువగా అంచనా వేయకు. ప్రేమ అనేది ఒక వరం. పవిత్రమైన భగవద్గీతతో సమానం. అది అదృశ్యంగా వున్న మహాశక్తి.

ఆరాధన, అనురాగం ఈ రెంటి కలయికే ప్రేమ'' నిజాయితీగా, నిదానంగా ప్రేమపట్ల తన మహోన్నతాభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

ఒక్క క్షణం రామ్‌ప్రకాష్ కళ్లలోకి సూటిగా చూసి అంది.

''సరే! ఐతే నేనూ మిమ్మల్ని

మహోన్నతంగా ప్రేమిస్తాను. బట్! ఒక్క షరతుపై. మీరన్నట్లుగా అంత పవిత్రమైంది ప్రేమ కాబట్టే... నన్ను ముట్టుకుని ముద్దుకూడా పెట్టుకోకుండా ప్రేమించాలి. మీ అంతటి మహా మహుల ప్రేమను పొందడంకూడా నా అదృష్టమే.

నిజంగానే మీరు ఇంత నిజాయితీగానుక ప్రేమిస్తే... ప్రేమ భగవత్ స్వరూపమని నేనే ఎలుగెత్తి చాటుతాను.

ఏమంటారూ! ఒప్పుకుంటారా?'' అదే చిరునవ్వుతో అంది కావ్య.

''చెప్పను. ఎందుకంటే ముందు ముందు నువ్వే చూస్తావుగా!'' తృప్తితో నిండిన స్వరంతో అన్నాడు రామ్‌ప్రకాష్.

''ఎక్స్‌క్యూజ్‌మీ సర్!'' అన్న పిలుపుతో ఇద్దరూ పక్కకి చూశారు.

''మనోజ్ నువ్వా! బెంగుళూరునుండి ఎప్పుడొచ్చావ్? అంతా కులాసాయేనా?'' అడిగాడు ప్రకాష్.

''నిన్న సాయంత్రమే వచ్చాను సార్!'' వినయంతో అన్నాడు మనోజ్.

''బైది బై ఈ అమ్మాయి కావ్య. నా ఫ్రెండ్'' మనోజ్‌కి పరిచయం చేశాడు రామ్‌ప్రకాష్.

''హలో'' అన్నాడు మనోజ్.

''మా కంపెనీలో జి.ఎం. మనోజ్'' కావ్యకి పరిచయం చేశాడు.

''నమస్తే'' అది కావ్య.

ఏదో మాట్లాడుతున్నాడుగానీ... పదేపదే కావ్యవైపే చూస్తున్నాడు మనోజ్.


ఇక వాళ్లమధ్యలోవుండలేక వెళ్లడానికి నిశ్చయించుకుని -

''ఇక వెళ్తాను సర్ థాంక్యూ '' అని నిల్చుంది కావ్య.

''రేపొకసారి ఫోన్ చేయి కావ్యా'' గంభీరంగా అన్నాడు రామ్‌ప్రకాష్.

''అలాగే సర్'' అంటూ.. ''ఉంటానండీ'' అంది మనోజ్‌తో.

# పెద్దగుడ్డు



ఆస్ట్రేలియాకు చెందిన 'కివి అన్న పక్షి సాధారణ కోడి. శరీర పరిమాణం రీత్యా ఒకే పరిమాణం కలిగివున్నా కోడిగుడ్డుకన్నా కివి పక్షి గుడ్డు ఎనిమిది రెట్లు పెద్దది. ఇంత పెద్ద గుడ్డు పెట్టడానికి అంత చిన్న పక్షి ఎంత ప్రసవవేదన పడి వుంటుందో ఊహించండి.

- ఎం. రజనీశకుంతల (సికింద్రాబాద్)

కావ్య వెళ్లినవైపే చూడసాగాడు మనోజ్. మనోజ్‌ని క్రీగంట గమనిస్తూనే వున్నాడు రామ్‌ప్రకాష్.

మళ్లీ అంతలోనే నవ్వుకున్నాడు.

● ● ●

తొలిచూపులోనే నా హృదయం మంచులా కరిగిపోతుందనుకోలేదు. నిజం! ఎంత అద్భుతమైన చూపు! పదునైన కత్తిలా తన మెదలో గుచ్చుకుని మధురమైన బాధను రగిలింపజేసింది.

'కావ్య!' ఎంత అందమైన పేరు! పేరును మించిన అందం. ఈ రెండక్షరాలతో తన మనసు ఇంతలా పెనవేసుకుంటుందనుకోలేదు.

ఐనా తనను చూసింది ఒకేసారైనా ఏదో మధురానుభూతి కలుగుతుంది. అలాంటి అమ్మాయి ఇంతవరకూ తారసపడలేదు.

నా 'మానస నందనం'లో 'ప్రణయరాగాన్ని' తట్టిలేపిన మొట్టమొదటి 'లేముగ్ధ' ఆమె. ఆమె సాన్నిధ్యాన్ని శాశ్వతంగా కోరుకుంటుంది -మనసు. కావ్య ఏం చేస్తుందో, ఎక్కడుంటుందో అన్ని వివరాలు 'రామ్‌ప్రకాష్' గారిని అడగాలి. వీలైతే ఆయన్నే వెళ్లి 'ఆమె' పెద్దవారితో మాట్లాడమనాలి.

అంతే -

ఆ ఆలోచన రాగానే వెంటనే 'రామ్‌ప్రకాష్' దగ్గరకు బయల్దేరాడు 'మనోజ్'

● ● ●

''కావ్య ఎవరమ్మా!'' ఒక మేడం వచ్చి క్లాసులో అమ్మాయిలతో అంది.

''ఎస్ మేడమ్, నేనే కావ్యని!'' అంది ఆశ్చర్యంతో.

''చూడమ్మా! నీకోసం ఎవరో వచ్చారు. విజిటర్స్‌రూమ్‌లో వెయిట్ చేస్తున్నారు'' గంభీర స్వరంతో అందావిడ.

వెంటనే క్లాసునుండి బయల్దేరింది. ''ఎవరొచ్చారు?'' ఆలోచిస్తూనే విజిటర్స్ రూమ్‌ని చేరుకుంది. అంతే -

చూడగానే సంభ్రమాశ్చర్యాలతో ''సర్ మీరా!'' అంది.

ఎదురుగా ''రామ్‌ప్రకాష్'' ఆమెని చూస్తూ నవ్వు నవ్వాడు సమాధానంగా.

''సర్ మీరు ఇలా ఇక్కడికి... ఐనా నేనే వచ్చాదాన్నిగా?'' అది కలో నిజమో తెలియక అయోమయంగా తడబడుతూ అంది.

''ఏం ఫరవాలేదు. ఎప్పుడూ నువ్వే రావాలా! నీకోసం నేను రాకూడదా!'' అన్నాడు రామ్‌ప్రకాష్.

''... ... ...''

''నీకభ్యంతరం లేకపోతే నీతో కాస్త మాట్లాడాలి. అలా బయటికెళ్దామా!'' అడిగాడు.

రెండు క్షణాలు ఏదో ఆలోచించి అంది.

''నేను పెట్టిన కండిషన్ గుర్తుందా సర్!'' మళ్లీ జ్ఞాపకం చేస్తున్నట్టుగా అంది.

''ఓ. యెస్ గుర్తులేకేం? వుంది. మొత్తానికి తెలివైనదానివే!'' అన్నాడు నవ్వుతూ.

''ఐతే పదండి వెళదాం'' అంది.

● ● ●

అది ప్రశాంతమైన వాతావరణం. అక్కడక్కడా జనం పలుచగా వున్నారు. తివాచీ పరిచినట్టు పచ్చటి గడ్డి, ఇరుప్రక్కలా సుగంధ పరిమళాలు వెదజల్లే పారిజాత వృక్షాలు.

''కావ్యా! నేనునీకు ఇందాక అరవై నిమిషాల్లో ఆరు సంవత్సరాలుగా నేను పడ్డ బాధంతా చెప్పాను.

నాపై నువ్వు జాలి చూపించాలని కాదు నా ఉద్దేశ్యం. నా బాధలు చెప్పుకోవడానికి నాకంటూ ఒక ఆత్మీయమైన వ్యక్తి వుందని గర్విస్తున్నాను.

నన్నందరూ ఏదో ఒక మహా వ్యక్తిగా ఒక సింహాన్ని చూసినట్టు చూస్తారు. బట్... ఒక మామూలు మనిషిలా నాతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడిన మొట్టమొదటి వ్యక్తి నువ్వే'' ఆరాధనగా అన్నాడు రామ్‌ప్రకాష్.

అతడలా... చెబుతుంటే... నిజంగా నమ్మలేని అద్భుతంలా అనిపించింది. అంత పెద్ద కంపెనీ ఎం.డి. అలా తనతో అన్నీ చెబుతుంటే ఎంతో గర్వంగా ఫీలైంది కావ్య.

కానీ... ఏం మాట్లాడాలో అర్థంకాలేదు కావ్యకి. అసలు తనెవరు? ఒక మామూలు మధ్యతరగతి అమ్మాయి. అంత పెద్ద మనిషి తనతో అలా ... ఏదో ఆలోచిస్తుండగా

''కావ్య! ఏంటాలోచిస్తున్నావ్?'' రామ్‌ప్రకాష్ పిలుపుతో ఉలిక్కిపడి ఈ లోకానికొచ్చింది. నేనిండియాలో వుండేది కేవలం మూడు నెలలు మాత్రమే!'' రవ్వంత బాధగా అన్నాడు.

''ఏంటి? మీరు వెళ్ళిపోతున్నారా!'' సంభ్రమాశ్చర్యంగా అంది కావ్య.

''అవును కావ్యా! ఇది చెప్పడానికే నిన్ను ఇక్కడికి తీసుకొచ్చాను. బిజినెస్ పనిమీదే స్టేట్స్ వెళ్తున్నాను. నేనొచ్చేసరికి కనీసం నాలుగు సంవత్సరాలు పట్టొచ్చు'' అన్నాడు.



''నాలుగు సంవత్సరాలా!'' దిగులుగా అంది కావ్య.

''వెళ్లేముందు నేన్నీకో మంచి గిఫ్టిస్తాను. ఆ గిఫ్టు ఎంత విలువైందంటే నీతో జీవితాంతం నా జ్ఞాపకంగా వుంటుంది'' ఆప్యాయంగా అన్నాడు రామ్‌ప్రకాష్.

''ఏమిటి సర్ అదీ'' ఉత్సుకతతో అడిగింది.

''అదేవిటో ఇప్పుడే చెబితే థ్రిల్లేముంటుంది?'' నవ్వుతూ అన్నాడు ప్రకాష్.

''... ... ...''

''చీకటి కావస్తోంది. ఇక వెళదామా!'' అన్నాడు ప్రకాష్.

''... ...''

ఎంతో నిజాయితీగా అంటున్న రామ్‌ప్రకాష్ పట్ల మరింత ఇష్టం పెరిగింది కావ్యకి.

● ● ●

''నిజంగా ఎంత మంచి వ్యక్తండీ!'' భర్తతో అంది రమాదేవి.

''ఇదంతా మన అమ్మాయి అదృష్టం. లేకపోతే అంత పెద్ద సంబంధం రావడమంటే మాటలా!'' సంతోషంతో అన్నాడు రంగారావు.

''అమ్మాయ్ కావ్యా! ఈరోజు నువ్వు కాలేజీకి వెళ్లాక రామ్‌ప్రకాష్‌గారు వచ్చారు'' కూతురితో చెప్పదలచాడు రంగారావు.

''ఏంటి రామ్‌ప్రకాష్‌గారొచ్చారా?!'' సంభ్రమాశ్చర్యంతో అంది కావ్య.

''అవునమ్మా! నీకు అన్ని విధాలా తగిన వరుణ్ణి చూశారట. అందగాడు, సంస్కారవంతుడు, పెద్ద ఉద్యోగి.

ఆ అబ్బాయి నిన్ను ఇదివరకే చూశాడుట. అన్నట్టు ఆ అబ్బాయిని కూడా తనతో తెచ్చారు. పేరు మనోజ్ అట. చాలా బుద్ధిమంతుడిలా వున్నాడు.

నువ్వు ఊ అంటే ముహూర్తాలు పెట్టించడమే తరువాయి. పైగా రామ్‌ప్రకాష్ గారుకూడా స్టేట్స్ వెళ్తున్నారట. ఆయన వెళ్లేలోపు శుభకార్యం ఆయనే దగ్గరుండి జరిపిస్తాననన్నారు''

''ఆ అన్నట్టు ఇదేదో నీకిమ్మన్నారు'' అంటూ ఏదో ఉత్తరం లాంటిది కవర్‌లో ఉన్నట్టుంది. కావ్యకందించాడు రంగారావు.

● ● ●

కావ్యా!

నీవు లేనప్పుడు మీ ఇంటికొచ్చినందుకు సారీ!

నేనొచ్చిన కారణం మీ నాన్నగారు నీతో చెప్పి వుంటారు. నీకు చెప్పకుండానే ఈ నిర్ణయం తీసుకుని నిన్ను సర్‌ప్రైజ్ చేశానుకదూ!

బైదిబై! నేన్నీకో గిఫ్ట్ ఇస్తానన్నాను గుర్తుందా! అదేవిటోకాదు. మనోజ్ నేనిచ్చే గిఫ్ట్. అతనికి నువ్వంటే చాలా ఇష్టం నిన్ను చూసినప్పటినుండి నాతో విషయమంతా చెప్పాడు.

అతడు నీకు అన్ని విధాలా యోగ్యుడు, తగినవాడు అని నేను భావిస్తున్నాను. నీక్కూడా ఇష్టమనే అనుకుంటున్నాను.

చివరగా ఒక్క మాట

ఇప్పటికైనా ఒప్పుకుంటావా ప్రేమ స్వార్థం కాదని ప్రేమ ఎప్పుడూ ఎదుటి వ్యక్తి శ్రేయస్సు, బాగుపడాలని కోరుకుంటుంది. రాయిలాంటి మనిషిని శిల్పంగా మలిచే అపురూపమైన అగుపించని అద్భుత శక్తి ప్రేమ.

ఇంతకన్నా ఎక్కువగా నేనేమీ చెప్పలేను.

ఉంటాను

ప్రేమతో

రామ్‌ప్రకాష్.

